# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో గత కొన్నేళ్లలో ఆరోగ్య మౌలిక వసతులు మరింత బలపడ్డాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు.**
3. **ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**
4. **రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం అయ్యాయి.**

==========================

దేశంలో గత కొన్నేళ్లలో ఆరోగ్య మౌలిక వసతులు మరింత బలపడ్డాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ – ప్రజల ఆశయాల సాధన' అంశంపై వెబినార్‌లో ఆయన ఈరోజు మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ యోజన, ఆరోగ్య మందిరాల ద్వారా గ్రామాల వరకు వైద్య సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. యోగా, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని అన్నారు. మారుతున్న పరిణామాలను అందిపుచ్చుకుంటూ యువత నూతన ఆలోచనలతో ముందుకు సాగడం హర్షణీయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ..

వాయిస్ 30 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు. డోన్ నియోజకవర్గం, కొత్తబురుజు గ్రామంలోని సభా ప్రాంగణంలో ఏర్పాటు హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. పండ్లకు కవర్ల తొడుగుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా గ్రామసభలో పాల్గొని రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తారు. అదేవిధంగా ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం స్థానిక రైతులతో ముఖ్యమంత్రి ముచ్చటిస్తారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.

-------------------------

రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలో ఆయన ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఇప్పటివరకు సుమారు 9 వేల ఉచిత సైకిళ్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా తాడేపల్లిలో రెండు వందల 94 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ కు ఆయన శంకుస్థాపన చేశారు. తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన 0.9 కిలో మీటర్ల నుంచి 2.610 కిలో మీటర్ల వరకు కృష్ణా నది కుడివైపున రక్షణ గోడ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నులకపేటలో కమ్యూనిటీ హాల్ ను మంత్రి ప్రారంభించారు.

---------------------------

రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానంతో పాటు.. పలు బిల్లులపై చర్చించనున్నారు. అలాగే పశ్చిమాసియా పరిస్థితులపై కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ రాజ్యసభలో ప్రకటన చేశారు.

---------------------------

ప్రపంచ కప్ విజయంతో భారత క్రికెట్‌కు ఒక కొత్త యుగం ప్రారంభమైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిజేతగా నిలిచిన జట్టులో సభ్యులు నేటి యువతకు ప్రేరణగా నిలుస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన భారత్ క్రికెట్ టీమ్ సభ్యులకు, కోచింగ్, సపోర్టింగ్ స్టాఫ్ కు శుభాకాంక్షలు తెలిపారు.అన్ని రంగాల్లో భారత ఆధిపత్యం ఇలానే కొనసాగాలని కేంద్రమంత్రి ఆకాంక్షించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వీ–బీజీ రామ్ జీ) పథకానికి ప్రత్యేకంగా లోగో రూపకల్పన కోసం పోటీని ప్రారంభించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిన్న వెల్లడించింది. ఈ పోటీని కేంద్ర ప్రభుత్వ అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ MyGov లో నిర్వహించనున్నట్లు సామాజిక మధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. వికసిత్ భారత్ – 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనను ప్రతిబింబించేలా సృజనాత్మక లోగోలను రూపొందించి ఈ నెల 20వ తేదీ లోపు సమర్పించాలని తెలిపింది. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారికి 50 వేల రూపాయల నగదును బహుమతిగా అందజేయనున్నట్లు వెల్లడించింది.

---------------------------

పరిశ్రమలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిరంతరం విధానపరమైన చర్యలు తీసుకుంటోందని

రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ అన్నారు. రాష్ట్ర సచివాలయం లో అయన ఆకాశవాణితో మాట్లాడారు. ఆత్మ నిర్భర్ భారత్ సాధించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ – పి.ఎల్.ఐ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. దేశీయ తయారీని ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వంతో తీర్చిదిద్దడమే పి.ఎల్.ఐ పథకం లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలని తెలిపారు.

---------------------------

రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 11, 12 తేదీల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సదస్సులో శాఖల వారీగా కార్యదర్శులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వనున్నారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్లు మాట్లాడుతారని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాంలలో దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం, లేక ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి యం. వెంకట్రావ్ పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర మహిళా కమిషన్ పనిచేస్తోందని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు నెల్లూరులో ఈరోజు మహిళా సమస్యల పరిష్కారం కోసం మహిళా జన సున్వాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల కోసం ఉద్దేశించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ సమస్యలపై వినతి పత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

పోలవరం జిల్లా రాజవొమ్మంగి అటవీశాఖ రేంజ్ పరిధిలో పులి సంచరిస్తుందని అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. రాజవొమ్మంగి రేంజ్ పరిధిలో ఉన్న కొత్తూరు, వీరభద్రపురం సమీప అటవీ ప్రాంతంలోకి నిన్న రాత్రి పులి వెళ్లినట్లు గుర్తించామని అటవీశాఖ అధికారులు చెప్పారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు వివరించారు.

=====================